www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 5 ఫిబ్రవరి 2023

బాలుర వసతి గృహంలో తనిఖీలు

ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న రాజేశ్వరి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి శనివారం స్థానిక శనివారపుపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. పిల్లలకు సంపూర్ణ పోషకాహారం అందించాలన్నారు. వీలైనంతవరకు సన్న రకం బియ్యాన్ని ఉపయోగించాలని సూచించారు. ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

పట్టాలెక్కని.. రైల్వే లైన్లు..!

- దశాబ్దాలుగా నిధుల కేటాయింపులో నిరాశే
- రూ.2,145 కోట్ల కొవ్వూరు-భద్రాచలం లైన్‌కు రూ.20 కోట్లే
- రూ.2,120 కోట్ల కోటిపల్లి-నరసాపురం లైన్‌కు రూ.100 కోట్లు
- రైల్వే బడ్జెట్‌లో జిల్లాకు తీరని అన్యాయమే
- రాష్ట్ర ప్రభుత్వం, ఎంపీల నిర్లక్ష్యమేనని జనం పెదవివిరుపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాకు చెందిన రైల్వేలైన్లపై మోడీ సర్కార్ తీరు అత్యంత దారుణంగా మారింది. దశాబ్దాల క్రితం ప్రతిపాదించిన రైల్వేలైన్లను పూర్తి చేయాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం లేకుండాపోయింది. ఏదో నామకేవాస్తే అన్నట్లు నిధులు కేటాయించి మమ అన్పిస్తోంది. ఈ విధంగా నిధుల కేటాయింపు జరిగితే మరో 20 ఏళ్లు అయినా జిల్లాలోని కొవ్వూరు-భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్లు పూర్తయ్యే పరిస్థితి లేదనే చెప్పాలి. జిల్లాలోని రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి నిధులు తేవడంలో రాష్ట్ర ప్రభుత్వం, ఇక్కడ ఎంపీలు పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉమ్మడి జిల్లా అభివృద్ధి చెందేందుకు దోహదపడే అత్యంత ముఖ్యమైన రైల్వేలైన్ల నిర్మాణం ఓ ప్రహసనంలా మారింది. దశాబ్దాలు గడుస్తున్నా రైల్వేలైన్ల ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్న పరిస్థితి నెలకొంది. 1965 నుంచి ప్రతిపాదనలో ఉన్న కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్‌పై కేంద్రం అనుసరిస్తున్న తీరు అత్యంత దారుణంగా మారింది. మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టి ఎనిమిదేళ్లు గడుస్తున్నా ఈ రైల్వేలైన్ గురించి పట్టించుకోలేదు. ఈ ఏడాదైనా ఈ లైన్‌కు సంబంధించి నిధుల కేటాయింపు ఉంటుందని అంతా ఆశలు పెట్టుకున్నారు. అయితే 151 కిలోమీటర్ల పొడవు కలిగినా ఈ రైల్వేలైన్‌కు ప్రస్తుత అంచనాల ప్రకారం రూ.2,140 కోట్లు వరకూ ఖర్చవుతుందని లెక్కలుగట్టారు. అయితే 2023-24 బడ్జెట్‌లో మోడీ సర్కార్ కేటాయించిన నిధులు కేవలం రూ.20 కోట్లు మాత్రమే. ఈ నిధులు సర్వే పనులకు సైతం చాలవని చెప్పొచ్చు. ఈ విధంగా నిధులు కేటాయిస్తే కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్ ఎన్ని దశాబ్దాలు పడుతుందో మోడీ సర్కార్ చెప్పాల్సి ఉంది. ఈ రైల్వే లైన్ పూర్తయితే ఏజెన్సీ, మెట్టప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందుతోంది. ఈ రైల్వేలైన్ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వంగాని, కేంద్ర ప్రభుత్వంగాని పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

కోటిపల్లి-నరసాపురం లైన్‌కు రూ.వంద కోట్లు మాత్రమే

కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్‌ను 2000-01లో మంజూరు చేశారు. రూ.2,120 కోట్లతో 57.12 కిలోమీటర్ల మేర ఈ లైన్ నిర్మిచాల్సి ఉంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం వాటాగా 25 శాతం నిధులు కేటాయించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కేటాయింపులు పక్కన పెడితే కేంద్రం గతేడాది బడ్జెట్‌లో రూ.21.40 కోట్లు ప్రస్తుత బడ్జెట్‌లో రూ.వంద కోట్లు కేటాయించారు. ఈ విధంగా నిధులు కేటాయిస్తే ఈ రైల్వేలైన్ పూర్తికావడానికి మరో 20 ఏళ్లు పట్టనుంది. ప్రతియేటా అంచనా వ్యయం పెరుగుతూనే ఉంటుంది. ఈ రైల్వేలైన్ నిర్మాణం జరిగితే తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని డెల్టావాసులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అయినా పాలకులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో ఈ రెండు రైల్వేలైన్లు దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటికీ పట్టాలెక్కని దుస్థితి నెలకొంది. జిల్లాకు చెందిన ఎంపీలుగాని, రాష్ట్ర ప్రభుత్వంగాని పట్టించుకోకపోవడం వల్లే రైల్వే లైన్ల పరిస్థితి ఈ విధంగా తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రైల్వేబడ్జెట్‌లో జిల్లాకు ఏఒక్కటీ లేదు

రైల్వే బడ్జెట్‌లో జిల్లాకు సంబంధించిన ఏఒక్క అంశమూ లేకుండాపోయింది. నరసాపురం-వారణాసి, నరసాపురం-యశ్వంత్‌పూర్‌కు రైళ్లు ఏర్పాటు చేయాలని జిల్లావాసులు కోరుతున్నా పట్టించుకోలేదు. నరసాపురం, చినమామిడిపల్లి వద్ద వంతెన లేదా అండర్ టన్నెల్ ఏర్పాటు, నరసాపురం-హైదరాబాద్ మధ్య రాత్రివేళ అదనపు రైలు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను సైతం పట్టించుకోలేదు. విజయవాడ-భీమవరం, నరసాపురం-నిడదవోలు రెండోలైన్ నిర్మాణం, విద్యుద్దీకరణ పనులకు సంబంధించి పెండింగ్ బకాయిలకు రూ.వంద కోట్లు కేటాయించారు. జిల్లావాసులు రైల్వే లైన్ల కలలు ఇప్పట్లో తీరే పరిస్థితి కనుచూపు మేర కానరావడం లేదు.

అంబరాన్నంటిన.. పిల్లల సంబరం

మాట్లాడుతున్న డిఆర్‌ఒ మూర్తి

'వందలాది మంది విద్యార్థులు.. తాము పాల్గొనదల్చిన పోటీలకు అనుగుణంగా వేషధారణ.. వెరసి ఆ ప్రాంతమంతా కళకళలాడుతుండగా.. 'పాడుదమా స్వేచ్ఛాగీతం' అంటూ అంతా చిన్నారులు రెట్టించిన ఉత్సాహంగా చేసిన ఆలాపన అందరినీ మంత్రముగ్ధులను చేసింది.


మాట్లాడుతున్న ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ఘనంగా హేలాపురి బాలోత్సవం ప్రారంభం
తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల్లోకి 'పాడుదమా స్వేచ్ఛా గీతం'

ప్రజాశక్తి - ఏలూరు

హేలాపురి బాలోత్సవం పేరిట మూడో పిల్లల సంబరాలు స్థానిక సర్ సిఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ గ్రౌండ్‌లో శనివారం ఉదయం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. బాలోత్సవం ప్రారంభ సూచికంగా జాతీయ జెండాను, బాలోత్సవం జెండాను ఆవిష్కరించారు. అనంతరం బాలోత్సవం ఆహ్వాన సంఘ అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన ప్రారంభ సభ జరిగింది. సభలో ముఖ్యఅతిథి, ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ నేటి కంప్యూటర్ యుగంలో పిల్లల్లో ఆటపాటలు, విజ్ఞానదాయక కార్యక్రమాలు కనుమరుగై యాంత్రికంగా తయారవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కులు, ర్యాంకులే కాకుండా సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పిల్లలు భాగస్వాములు కావాలని, అప్పుడే వారిలో మానసిక పరిపక్వత వస్తుందని అన్నారు. బాలోత్సవ కార్యక్రమాలను విస్తరింపజేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. మరో ముఖ్యఅతిథి జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎస్‌ఎన్.మూర్తి మాట్లాడుతూ మారిన పరిస్థితుల్లో పిల్లలు తమ కీలకమైన బాల్యాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పాఠశాల విద్యలో క్రాఫ్ట్, ఉడ్ వర్క్, డ్రాయింగ్ తదితర అంశాలుండేవని ఆయన గుర్తు చేశారు. బాల్య జ్ఞాపకాలు జీవితాంతం ఉంటాయని, కాబట్టి ఇలాంటి బాలోత్సవాలు మరెన్నో జరగాలని ఆకాంక్షించారు. డిఇఒ అవధాని మాట్లాడుతూ అందరికీ విద్య అందాలన్నారు. ప్రతిరోజూ విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాలతోపాటు గ్రంథాలయాల్లోని పుస్తకాలను అధ్యయనం చేయాలన్నారు. సిఆర్ రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ బాలోత్సవాల నిర్వహణ కష్టతరమైనప్పటికీ బాగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. అమరావతి బాలోత్సవ నిర్వాహకులు పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ పిల్లల మానసిక వికాసానికి తోడ్పడుతున్న బాలోత్సవ కార్యక్రమాలను ఉద్యమ తరహాలో విస్తరింపజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్, ప్రిన్సిపల్ సాయికుమారిశంకర్, స్కూల్ డైరెక్టర్ రాజ్ కల్, దీపక్ నెక్స్‌జెన్ అధినేత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం, మానవత జిల్లా అధ్యక్షులు ఆర్.గంగాధర్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, కోశాధికారి విజిఎంవిఆర్.కృష్ణారావు, మారుబోయిన కోటేశ్వరరావు, అడుసుమిల్లి నిర్మల, డి.హేమసుందర్, ముస్తఫా ఆలీ, కట్టా సత్యనారాయణ, జె.సత్యనారాయణరాజు, మేతర అజయ్‌బాబు, కె.శ్రీనివాస్, పి.కిషోర్, డిఎన్‌విడి.ప్రసాద్, ఎంఎస్ఎంఎస్.కుమార్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.రవికుమార్, పివి.నరసింహారావు, పలువురు ప్రముఖులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

60 రకాల కల్చరల్, అకడమిక్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారు. జానపద నృత్యం, విచిత్ర వేషధారణ, కోలాటం, శాస్త్రీయ నృత్యం, దేశభక్తి గీతాలాపన, లఘు నాటిక, ఏకపాత్రాభినయం తదితర కల్చరల్ పోటీలతోపాటు క్విజ్, తెలుగులో మాట్లాడటం, కథ చెప్పడం, వక్తృత్వం, చిత్రలేఖనం తదితర అకడమిక్ పోటీలు నిర్వహించారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల్లో 'పాడుదమా స్వేచ్ఛా గీతం'

'పాడుదమా స్వేచ్ఛా గీతం' దేశభక్తి పాటను బాలోత్సవం సందర్భంగా వెయ్యి మందికిపైగా ఒకేసారి పాడటంతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేశారు. స్థానిక సిఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ ఆవరణలో బాలోత్సవం ప్రారంభ సభ అనంతరం ఈ కార్యక్రమం నిర్వహించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల్లో 'పాడుదమా స్వేచ్ఛా గీతం' పాట నమోదు కోసం చేపట్టిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పాడుదమా స్వేచ్ఛా గీతం నమోదైనట్లు సర్టిఫికెట్, మెడల్ ఆహ్వాన సంఘ నాయకులకు అందజేశారు.

పాడుదమా స్వేచ్ఛాగీతం ఆలపిస్తున్న నిర్వాహకులు, నేతలు, ప్రముఖులు

చిత్రలేఖనం పోటీలు

గురుకుల భవనాల నిర్మాణం పూర్తి చేయాలి

కలెక్టర్, ఎంఎల్‌ఎకు సిపిఎం వినతి


వినతి అందించిన సిపిఎం నేతలు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు సంబంధించి పూర్తికాని భవనాలను వెంటనే పూర్తి చేసి విద్యార్థుల సౌకర్యాలు మెరుగుపర్చాలని, నాగిరెడ్డిగూడెం బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను హైస్కూల్ స్థాయినుండి ఇంటర్ వరకూ పొడిగించాలని సిపిఎం చింతలపూడి ఏరియా కన్వీనర్ రామిశెట్టి సత్యనారాయణ కోరారు. పట్టణంలో చేయూత మహిళా మార్ట్‌ను ప్రారంభించడానికి వచ్చిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు సిపిఎం ఆధ్వర్యాన వినతిపత్రం అందించారు. అనంతరం ఎంఎల్‌ఎ ఎలిజాకు కూడా వినతి అందజేశారు. దీనిపై కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ గురుకుల పాఠశాల భవనాలను ఎట్టి పరిస్థితుల్లో వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేసి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, కనమతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, కాగిత రాఘవులు, సోషల్ వర్కర్ పాకా సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

స్వపక్షం.. నివురుగప్పిన నిప్పేనా..!

చాపకింద నీరులా అధికారపక్షంలో అసమ్మతి

బిజెపితో సఖ్యత.. అభివృద్ధి పనులకు నిధుల లేమిపై పెదవివిరుపు

సమస్యలపై అధికారిక సమావేశాల్లో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే గళమెత్తితే స్వపక్షమే విపక్షమైందని అంతా అంటుంటారు అయితే రాజకీయపరమైన వైరం స్వపక్షంలోనే నివురుగప్పిన నిప్పులా ఉంటే.. బడబాగ్ని కాక తప్పదు. దానికి నెల్లూరు జిల్లాలో అధికార వైసిపిలో నెలకొన్న ప్రకంపనలే నిదర్శనం. అయితే ఆ పరిస్థితి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోనూ చాపకింద నీరులా ఉందని, ఇటీవల కేంద్ర బడ్జెట్‌పై స్పందన, నిధుల లేమి తదితర అంశాలు అసంతృప్తి అసమ్మతి రూపం తీసుకుంటోందని అధికార పార్టీ నేతలే నెల్లూరు గురించి చర్చల్లో వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం.

ఏలూరు జిల్లాలో ఇప్పటికే చింతలపూడి నియోజకవర్గంలో అధికార పార్టీ రెండు గ్రూపులుగా చీలిపోయిన సంగతి తెలిసిందే. ఇది జంగారెడ్డిగూడెం మున్సిపల్ పాలకవర్గంలోనూ, కామవరపుకోట, లింగపాలెం మండలాల్లోని స్థానిక సంస్థల్లోనూ చాలా స్పష్టంగా కన్పిస్తోంది. కైకలూరు, దెందులూరు, ఏలూరులో కూడా వివిధ కారణాల పేరిట అంతర్గతంగా కుమ్ములాటలు ఉన్నాయి. ఏలూరులో కార్పొరేషన్ విషయంలో పార్టీ పరువు బజారున పడిందని ఆ పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. అదే క్రమంలో ఈసారి ఏలూరు ఎంఎల్‌ఎ టిక్కెట్ బిసికి ఇవ్వాలని, ఇస్తారని ప్రచారం జోరందుకోగా ఒక మహిళా కార్పొరేటర్ బహిరంగంగానే పార్టీ అధినేతను కలిసే ప్రయత్నం చేయడం చర్చనీయాంశమైంది. అదేక్రమంలో కార్పొరేషన్ పెద్దగా వ్యవహరిస్తున్న ప్రముఖులు కూడా టిక్కెట్ రేసులో ఉండటం, కొన్ని అంశాల్లో ఎంఎల్‌ఎతో విబేధిస్తుండడం ఆ పార్టీ నేతల్లో నెలకొన్న లుకలుకలను ప్రతిబింబిస్తుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఏలూరు, చింతలపూడి నియోజకవర్గాల్లో ఎన్నికల సమయంలో టిక్కెట్ల కేటాయింపు సమయానికి నెల్లూరు తరహా తిరుగుబాట్లు తలెత్తే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈలోపు అధిష్టానం జోక్యం చేసుకుని రాజీకి చర్యలు చేపట్టకపోతే తలపోట్లు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఇక పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఉండి, భీమవరం, పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లోనూ అసమ్మతి సెగ నివురుగప్పిన నిప్పులా ఉంది. ఉండి నియోజకవర్గంలో అధికార పార్టీ తరచూ నియోజకవర్గ ఇన్‌ఛార్జులను మారుస్తుండడమే దీనికి నిదర్శనంగా చెప్పొచ్చు. దీనికితోడు మాజీ మంత్రి ఒకరు ఈ నియోజకవర్గంలో నేరుగా జోక్యం చేసుకోవడం ఆ నియోజకవర్గ నేతలకు రుచించడం లేదు. దీంతో ఎప్పుడు ఎలాంటి పరిస్థితి ఏర్పడుతుందో అర్థం కాని పరిస్థితి. టిడిపికి చెందిన మాజీ ఎంఎల్‌ఎ శివ మళ్లీ రాజకీయ కార్యకలాపాల్లో చురుగ్గా ఉండటంతో ఆ నియోజకవర్గ సమీకరణల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆయనకంటూ ప్రత్యేక అనుచరగణం ఉంది. అక్కడ గత ఎన్నికల్లో టిడిపి గెలిచినా శివ రాజకీయాలకు దూరంగా ఉండటం, ఎంఎల్‌ఎ తీరుతో ఆ అనుచరగణమంతా వైసిపి గూటికి చేరింది. శివ మళ్లీ రాజకీయాల్లో క్రియాశీలం కావడంతో వైసిపిలో ఉన్న అనుచరగణమంతా ఆయన వెంట నడిచేందుకు సిద్ధమైనట్లు ప్రచారం సాగుతోంది. అయితే శివ వచ్చే ఎన్నికల్లో టిడిపి నుంచే బరిలోకి దిగుతారా లేక పార్టీ మారతారా అనే దానిపై స్పష్టత వచ్చేంత వరకూ వారంతా వేచిచూసే ధోరణి అవలంబిస్తున్నట్లు సమాచారం. మొత్తంగా ఇది అక్కడ ఇరు పార్టీలకూ శివ అంశం సకంటంగానే ఉంది. ఇక అధికార పార్టీకైతే ఆశావహులు ఎక్కువ ఉండటం ఇబ్బందికరంగా మారిందని చెప్పొచ్చు. భీమవరం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై గెలుపొందారు. తనకు మంత్రి పదవి వస్తుందని రెండుసార్లు భావించినా చివరి నిమిషంలో చేజారిందనే బాధ గ్రంధి అనుచరుల్లో ఉంది. దీనికితోడు శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుకు, గ్రంధికి మధ్య పొరపొచ్చాలు నెలకొన్నాయని, దీనివల్ల ఒకింత ఆధిపత్య పోరు కూడా సాగుతోందని ప్రచారం సాగుతోంది. ఇది రానున్న ఎన్నికల నాటికి ఏరూపం తీసుకుంటుందో వేచిచూడాలి. పాలకొల్లులో ఎంఎల్‌ఎ టిక్కెట్ రేసులో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌తోపాటు మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, ఇతరులు ఉన్నారు. ఇక్కడ నేతల మధ్య సయోధ్య లేకపోవడం ఇబ్బందికరంగా ఉంది. ఆచంటలో వారసుడిని రంగంలోకి దింపేందుకు యత్నించడం స్థానిక నేతల్లో అసంతృప్తి నెలకొంది. మొత్తం ఈ పరిణామాలన్నీ ఆయా నియోజకవర్గాల్లో అధికార పార్టీ నేతల్లో తీవ్ర అసంతృప్తికి తార్కాణాలని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

పై అంశాలకు తోడు కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు, రాష్ట్రానికి ఎటువంటి ప్రాధాన్యతా లేకపోవడం, ఎన్నికలు సమీపిస్తున్న వేళ కనీసం అభివృద్ధి కార్యక్రమాలు నియోజకవర్గాల్లో ఊపందుకోకపోవడం అధికారపక్ష ప్రజాప్రతినిధుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు, రెవెన్యూ లోటు పూడ్చుకునేందుకు ప్రతిసారీ కేంద్రం ముందు మోకరిల్లే బదులు ప్రత్యేక హోదా గురించి నిలదీస్తే కనీసం నిధులైనా విడుదలయ్యేవని, ఇటు ప్రజల్లోనూ తాము దోషిగా ఉండాల్సిన పరిస్థితి ఉండేది కాదని బహిరంగంగానే అధికార పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. కేంద్రంలోని బిజెపికి అన్నివిధాలుగా సహకరిస్తూ మద్దతిస్తున్నా బడ్జెట్‌లో రాష్ట్రానికి సంబంధించిన కొన్ని అంశాలైనా ప్రస్తావనకు తీసుకురాకపోవడం దారుణమని వ్యాఖ్యానిస్తున్నారు. జిల్లాలోని కోటిపల్లి-నరసాపురం, కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్లకు నిధులు అతితక్కువగా కేటాయించడంపై పెదవి విరుస్తున్నారు. బిజెపితో సఖ్యత, కనీసంగా హామీలు అమలు కాకపోవడం, అభివృద్ధి పనులు ముందుకు సాగకపోవడం వచ్చే ఎన్నికల్లో తమకు ప్రతికూలంగా మారుతాయని వైసిపి ఎంఎల్‌ఎలు సైతం తలలు పట్టుకుంటున్నారు. వీటికి తోడు అంతర్గత కుమ్ములాటలు మరింత పెరిగితే నెల్లూరు తరహా తిరుగుబాట్లు ఇక్కడా అధికార పార్టీకి తప్పవని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయో వేచిచూడాలి.

- వివిఎస్‌వి.ప్రసాద్

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

చేయూత మహిళా మార్ట్ ప్రారంభ సభలో ఎంఎల్‌ఎ, ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - చింతలపూడి

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో పొదుపు సంఘాల ఆధ్వర్యంలో చేయూత మహిళా మార్ట్‌లను ప్రారంభిస్తున్నారని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో స్థానికంగా ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్‌ను శనివారం ఎంఎల్‌ఎ విఆర్.ఎలిజా, పిఆర్‌అండ్‌ఆర్‌డి స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగడానికి ఇది చక్కని అవకాశమన్నారు. రాష్ట్రంలో 8.6 లక్షల సంఘాలున్న ఈ వ్యవస్థలో 90 లక్షలు మహిళా సభ్యులు ఉన్నారన్నారు. రాష్ట్రంలో స్త్రీ నిధి, ఎస్‌హెచ్‌జి రుణాల తిరిగి చెల్లింపు 99 శాతం ఉండటం అభినందనీయమన్నారు. అట్టడుగు నిరుపేద కుటుంబాలను అభివృద్ధిలో ఉంచేందుకు చిన్న సంఘాలు మరింత బలోపేతం కావాలని, ఆ దిశగా చర్చ జరగాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. వైఎస్ఆర్ చేయూత కార్యక్రమంలో భాగంగా తొలుత జంగారెడ్డిగూడెంలో, ప్రస్తుతం రెండోది చింతలపూడిలో చేయూత మహిళా మార్ట్ ప్రారంభించుకుంటున్నామన్నారు. ఫిష్ ఆంధ్రా కింద మినీ అవుట్‌లెట్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. చింతలపూడి ఎంఎల్‌ఎ ఎలిజా మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన గొప్ప ఆలోచనకు ప్రతిరూపం చేయూత మహిళా మార్ట్ అని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జె.జానకిరెడ్డి, ఎంపిపి బి.రాంబాబు, జెడ్‌పిటిసి నీరజా సుధాకర్, సెర్ప్ అదనపు డైరెక్టర్ మహిత మాట్లాడారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్, ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డిపిఒ మల్లికార్జున్, జిఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి రమణ, మున్సిపల్ కమిషనర్ రాంబాబు, ప్రసాద్, తహశీల్దారు కృష్ణజ్యోతి, ఎంపిడిఒ మణికుమారి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బుడితి రాజశేఖర్

కాట్రేనిపాడులో తల్లి, కుమార్తె దారుణ హత్య

ప్రజాశక్తి - ముసునూరు

తల్లీకుతుళ్లు అనుమానాస్పద స్థితిలో హత్యకు గురైన ఘటన మండలంలోని కాట్రేనిపాడు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కాట్రేనిపాడు గ్రామంలోని ఎన్‌టిఆర్ కాలనీలో సొంగా ఏసుమరియమ్మ (39) ఆమె కుమార్తె అఖిల(17) నివాసం ఉంటున్నారు. ఏసుమరియమ్మ, తన భర్త పదేళ్ల క్రితం విడాకులు తీసుకున్నారు. ఈ క్రమంలో ఏసుమరియమ్మ తన కుమార్తెతో కలిసి ఎన్‌టిఆర్ కాలనీలోనే నివాసం ఉంటుంది. ఈ క్రమంలో శనివారం ఉదయం వేరే గ్రామం నుంచి ఏసుమరియమ్మ సోదరుడు ఇంటికి వచ్చాడు. బయట తాళం వేసి ఉండటంతో పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా తల్లీకుతుళ్లు హత్యకు గురై మృతి చెంది ఉన్నారు. దీంతో అతను పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి సిఐ అంకబాబు, ఎస్ఐ కుటుంబరావు చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థినులకు జ్ఞాపికలు అందిస్తున్న కళాశాల సిఇఒ, ప్రిన్సిపల్

జాతీయ స్థాయి పోటీలకు 'ఎన్ఆర్ఐ' విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు

ఇటీవల ప్రకాశం జిల్లా దొనకొండలో 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ జిల్లాల అండర్-17 బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిందని ఏలూరు ఎన్ఆర్ఐ కళాశాల సిఇఒ వి.తులసీరామ్ తెలిపారు. ఆ జట్టులో ప్రాధాన్యత క్రీడాకారిణులుగా ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల విద్యార్థినులు జి.ప్రవల్లిక, ఎస్.కెస్సెత్నశ్రీ పాల్గొని విజయం సాధించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సిఇఒ తులసీరామ్ మాట్లాడుతూ క్రీడల ద్వారా ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి.కనకరత్నం, ఇ.మురళీకృష్ణ, కె.ప్రభాకరరావు, ఎస్.సత్యనారాయణ, కళాశాల ఏఒలు కె.మల్లికార్జునరావు, వి.రాట్నాలు, ఎస్.రామాంజనేయులు, జె.నాగరాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిని పరిశీలించిన ఎన్‌బిఇఎంఎస్ టీమ్

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో నేషనల్ బోర్డ్ ఎగ్జామినేషన్స్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బిఇఎంఎస్) టీమ్ శనివారం పరిశీలించారు. మెడికల్ సైన్సెస్ విద్యార్థులకు ఇఎన్‌టి, ఆప్తమాలజీ, ఎనస్థీషియా వంటి సీట్లు కేటాయించాలని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ నుంచి ప్రతిపాదనలు రావడంతో పరిశీలన కొనసాగించారు. పరిశీలన బృందానికి డాక్టర్ అమర వెంకట మహేష్ నేతృత్వం వహించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్, డాక్టర్ సహానం, వైద్యులు పాల్గొన్నారు.

విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి- జీలుగుమిల్లి

మండలంలో పని చేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు విధుల్లో సక్రమంగా ఉండాలని వ్యవసాయ సంచాలకులు ఎడి బుజ్జిబాబు చెప్పారు. శనివారం ఆయన పలు రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. పలు కేంద్రాల్లోని సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు విధుల్లో సక్రమంగా ఉండాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులందరూ ఫిబ్రవరి 15 తేదీ లోపు ఈ పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. పిఎం కిసాన్ యోజన పథకంలో నమోదు చేసుకున్న రైతులు కూడా బయోమెట్రిక్ వేయాలని తెలిపారు. అందుకు అగ్రికల్చర్ అసిస్టెంట్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మంగతాయారు, వ్యవసాయ అధికారి గంగాధర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు రేష్మి, దుర్గ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మహిళా కూలీల ఆటో బోల్తా

ఇద్దరికి తీవ్ర, 18 మందికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - చాట్రాయి

మహిళా కూలీల ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఆటో డ్రైవర్‌కు, 18 మంది కూలీలకు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామానికి చెందిన మహిళా వ్యవసాయ కూలీలు చాట్రాయి మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న వెన్నుతీత పనికి ప్రతిరోజు ఆటోలో వస్తుంటారు. ఈ క్రమంలో శనివారం ఆటోలో 20 మంది మహిళా కూలీలు జనార్ధనవరం పనికి వెళ్లి తిరిగి ప్రగడవరం బయలుదేరారు. చాట్రాయి సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఐస్‌క్రీమ్ బండిని తప్పించబోయి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలవ్వగా, డ్రైవర్‌కు మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని స్థానికులు 108 అంబులెన్స్‌లో చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు

పోలీసులకు పలువురి అభినందనలు

ప్రజాశక్తి - మండవల్లి

తప్పిపోయిన బాలుడి ఆచూకీని పోలీసులు చాకచక్యంతో 24 గంటలు గడవకముందే కనిపెట్టి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. దీంతో పోలీసులను తలి దండ్రులతో పాటు పలువురు అభినందించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అప్పాపురానికి చెందిన ధర్మరాజుల రాంబాబుకు 13 సంవత్సరాల వయస్సు కలిగిన ధర్మరాజులు కొండామణిదీప్ ఉన్నాడు. మణిదీప్ మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల రెండో తేదీన యధావిధిగా పాఠశాలకు వెళ్లాడు. సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల ఇళ్ల వద్ద గాలించగా కొండా మణిదీప్ ఆచూకీ కానరాలేదు. దీంతో తల్లిదండ్రులు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు డిఎస్‌పి పైడేశ్వరావు ఆధ్వర్యంలో సిఐ వైవిఎల్.నాయుడు పర్యవేక్షణలో బృందాలను ఏర్పాటు చేసి బాలుడు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం నరసాపురం రైల్వేస్టేషన్‌లో ఏడుస్తూ తిరుగుతున్న బాలుడిని మండవల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం బాలుడిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎఎస్ఐ కాకొల్లు రాజు తెలిపారు. ఎంతో చాకచక్యంగా వ్యవహరించి బాలుడి ఆచూకీ కనిపెట్టి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించడంపై అప్పాపురం గ్రామస్తులు, బాలుని తల్లిదండ్రులు, బంధువులు, పలువురు ప్రముఖులు మండవల్లి పోలీసులను అభినందించారు.

భూ వివాదంలో 11 మంది అరెస్టు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని గటాటుగూడెంలో బొమ్మదేవర వెంకట నరసింహారావు పేరున ఉన్న పొలంలో పంట తీసుకునే విషయంలో రెండు గ్రూపుల మధ్య చోటుచేసుకున్న వివాదంలో 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. గటాటుగూడెం గ్రామానికి చెందిన 20 మంది పంటకోసం గొడవ పడ్డారని, వారికి గాయాలు కావడంతో ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు రెండు గ్రూపులకు చెందిన 20 మందిపై కేసు నమోదు చేసి 11 మందిని అరెస్టు చేశామని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

బలివే ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

డిఎస్‌పి కె.అశోక్‌కుమార్‌గౌడ్, కెఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ ఎం.రజినీకుమారి

ప్రజాశక్తి - ముసునూరు

బలివే శ్రీరామలింగేశ్వర స్వామి ఉత్సవాల్లో డ్రోన్ కెమెరాలు నిషేధించామని, ఎవరైనా అతిక్రమిస్తే సీజ్ చేయడంతో పాటు వారిపై చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి కె.అశోక్‌కుమార్‌గౌడ్, కెఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ ఎం.రజినీకుమారి హెచ్చరించారు. మండలంలోని బలివే శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద కెఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ ఎం.రజినీకుమారి ఆధ్వర్యంలో బలివే ఉత్సవాల ఏర్పాట్లపై మండల, డివిజన్ స్థాయి అధికారులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బి ఎఇ మాట్లాడుతూ రోడ్లకు మరమ్మతులు చేస్తామని తెలిపారు. బలివే ప్రధాన ఆలయం వద్ద బారికేడ్లు ఏర్పాట్లు, దర్శనం, పూజావిధానాలు ఆలయ ఇఒ టి.విశ్వేశరరావు పర్యవేక్షణలో ఉండాలన్నారు. బలివే గ్రామ సర్పంచి లావు ప్రవీణ్ సుధాకర్ మాట్లాడుతూ సుమారు రెండు లక్షల మందిపైగా ఉత్సవాలకు వస్తారన్నారు. తమ్మిలేరుపై తాత్కాలిక వంతెన నిర్మించాలని సూచించారు. ఉత్సవాల సమయంలో అక్రమ మద్యం, సారా నిషేధించేలా చూడాలని ఎక్సైజ్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ టి.గోపాలకృష్ణకు సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాట్లు ముందుగానే 4, 5 ప్రదేశాల్లో చేయాలన్నారు. వైద్య సిబ్బంది, మూడు షిఫ్టులగా 24 గంటలు 108 వాహనంతో అందుబాటులో ఉండాలన్నారు. విద్యుత్, ఇరిగేషన్, ఆర్‌టిసి శాఖలు రాకపోవడంతో ముఖ్య అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయితీవారు జల్లు స్నానాలు, శానిటేషన్, తాగునీరు చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సిఐ అంకబాబు, ఏలూరు సిఐ కె.దుర్గాప్రసాద్, ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ దాసరి సుధ, పెదవేగి తహశీల్దార్ నాగరాజు, పెదవేగి ఎస్ఐ ఎం.లక్ష్మణ్, ముసునూరు ఎస్ఐ ఎం.కుటుంబరావు, ఎఇ కూచిపూడి సాయిరాము, పంచాయితీ ఎఇ టి.నరసింహారావు పాల్గొన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్‌గౌడ్, రజినీకుమారి

జర్నలిస్టుల సమస్యలు సానుభూతితో పరిష్కరించాలి

ఎపి వర్కింగ్ జర్నలిస్టుల మహాసభలో వక్తలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పాత్రికేయుల సమస్యలను ప్రభుత్వాలు సానుభూతితో పరిష్కరించాలని ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల సమావేశంలో వక్తలు కోరారు. స్థానిక ప్రియదర్శిని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు వక్తలు ప్రభుత్వ పరంగా లభించే సౌకర్యాలు నిలిపివేశారని, వాటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో సామాజిక బాధ్యత కలిగి జర్నలిస్టుల సంక్షేమం గురించి ప్రజా ప్రతినిధులు యోచించాలని విశిష్ట అతిథిగా విచ్చేసిన టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సేవా సంస్థ అధ్యక్షులు ఆకుమర్తి రామారావు కోరారు. మీడియా సభ్యులు తన కుటుంబ సభ్యుల వంటి వారన్నారు. వారికి ఏ అవసరం వచ్చినా తాను ముందుంటానని వాగ్దానం చేశారు.



మాట్లాడుతున్న ఆకుమర్తి రామారావు

విద్యావేత్త అలుగు ఆనందశేఖర్ మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన జర్నలిస్టుల సంఖ్య బాగా పెరిగిందని తెలిపారు. సమిష్టిగా ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ప్రజాశక్తి జిల్లా ప్రతినిధి పి.గంగరాజు మాట్లాడుతూ జర్నలిస్టుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. అక్రిడిటేషన్లు తగ్గిపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. రాష్ట్ర కార్యదర్శి కెఎస్.శంకరరావు మాట్లాడుతూ కలిసి ఉంటే కలదు సుఖం అన్నారు. ఐక్యతే బలం అని పిలుపునిచ్చారు. సూర్య మేనేజర్ పసుమర్తి రాము జర్నలిస్టుల కోసం తన వంతుగా ఇన్సూరెన్స్ తరహాలో సహాయం చేస్తానని వాగ్దానం చేశారు. బాబ్జి గ్రూప్ అధినేత షకీల్ బాబ్జి, పలువురు మాట్లాడారు.

పోలవరం నూతన కమిటీ ఎన్నిక

పోలవరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గిరికుమార్, కార్యదర్శిగా బుచ్చిబాబు, కోశాధికారిగా అప్పారావు ఎన్నికయ్యారు. సమావేశానికి చింతలపూడి ఎపిడబ్ల్యు జెఎఫ్ అధ్యక్షులు కె.చిన్నారావు అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి గొల్లమందల శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టులు జాబీర్, సోమశేఖర్ పిఎన్‌వి .రామారావు పాల్గొన్నారు. రెండు నియోజకవర్గాలకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరయ్యారు.

ఉపాధి హామీ చట్టానికి కేంద్రం తూట్లు : వ్యకాస

కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస నాయకులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తున్న కేంద్ర ప్రభుత్వ దుర్మార్గపు పాలన నశించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం అన్నారు. మండలంలోని లక్కవరం గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశంలో సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకరరావు, ఎం.జీవరత్నం శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా జీవరత్నం మాట్లాడుతూ తక్షణమే బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి రూ.2.5 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు జిల్లాలో రూ.కోట్లు ఉన్నాయని, ఆ డబ్బులు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయకుండా ఉపాధి కూలీల మీద అక్కసుతో ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయటం కోసం రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. గత సంవత్సరం బడ్జెట్ రూ.90 వేల కోట్లు కేటాయించి ఈ ఏడాది బడ్జెట్ 30 వేల కోట్లు తగ్గించటం వ్యవసాయ కార్మికుల పట్ల మోడీకి ఉన్న చులకన భావం అన్నారు. ఉపాధి హామీ చట్టంలో 200 రోజులు పనులు కల్పించి రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కేంద్ర ప్రభుత్వానికి లేఖ ద్వారా తెలియజేసిందని, కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల అభిప్రాయాన్ని పక్కనపెట్టి కార్పొరేటర్లకు, ప్రయివేట్ సంస్థలకు నిధులు కేటాయించిందని అసహనం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై నోరు మెదపకపోవటం దుర్మార్గమని విమర్శించారు. ఉపాధి హామీ చట్టానికి నిధులు పెంచేవరకు కూలీలను ఐక్యం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండ కడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎ.ప్రభాకరరావు పాల్గొన్నారు.

రజకులకు చెరువులు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జిఒ 343 ప్రకారం రజకులకు చెరువులు కేటాయించాలని ఉమ్మడి గోదావరి జిల్లాల రజక సంఘం అధ్యక్షులు చాటపర్తి పోసిబాబు కోరారు. స్థానిక డివిజనల్ పంచాయతీ అధికారి ఎస్ఎస్.నగేష్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి మండలంలోని అమ్మపాలెం గ్రామపంచాయతీ, కట్టపొదలవారిగూడెం, పోలవరం, చిన్నవారిగూడెం, మంగిశెట్టిగూడెం, అక్కంపేట తదితర గ్రామాల్లో జిఒ 343 అనుసరించి రజకులకు చెరువులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపల్లి రవి, రజక సంఘం మండల అధ్యక్షులు లింగాల సత్యనారాయణ పాల్గొన్నారు.

రూ.6 లక్షలతో నూతన మోటార్ ఏర్పాటు

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరు గ్రామ పంచాయితీ పరిధిలో పంచాయతీ నిధులు రూ.ఆరు లక్షలతో నూతన మోటారు ఏర్పాట్లు చేశారు. పాత మోటార్ తరచూ మరమ్మతులకు గురవ్వడంతో సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి నూతన మోటార్ బిగించేలా చర్యలు తీసుకుని గ్రామస్తులు తాగునీటి ఎద్దడి ఎదుర్కొకుండా చూశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి తోట శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - నూజివీడు

పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సిఐ ఎంవివిఎస్ఎన్.మూర్తి సూచించారు. ద్విచక్రవాహనదారులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధారణ ప్రభుత్వ నిబంధన ఒక్కటే మాత్రం కాదని, ద్విచక్ర వాహన చోదకుల ప్రాణ రక్షణ కవచంగా గుర్తించాలని తెలిపారు. ప్రతి ద్విచక్రవాహనాన్ని నిలుపుదల చేసి హెల్మెట్ ధరిస్తేనే వాహనాన్ని యజమానులకు అందిస్తున్నట్లు తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - భీమడోలు

పొలసానిపల్లికి చెందిన అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటానని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు హామీ ఇచ్చారని సర్పంచి షేక్ రహీమా బేగం హసేన తెలిపారు. శుక్రవారం సాయంత్రం సంభవించిన అగ్ని ప్రమాదంలో మద్దాల శ్రీమన్నారాయణకు చెందిన ఇల్లు దగ్ధమైంది. సదరు కుటుంబం వారు నిరాశ్రయులు కాగా రూ.రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో సర్పంచి షేక్ రహీమా బేగం హసేన దంపతులు శనివారం అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారిని ఆదుకుంటానని ఎంఎల్ఎ హామీ ఇచ్చారని తెలిపారు. తమ వంతు సహాయంగా బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం ఇతర వస్తువులు అందించారు. ఎంఎల్ఎ చొరవతో ప్రభుత్వ పరంగా వారికి మంజూరయ్యే సహాయాన్ని త్వరలోనే అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో సర్పంచి దంపతులు గ్రామంలో జగనన్న- వాసన్న కాలనీలో గృహ నిర్మాణ సంస్థ సహకారంతో నిర్మాణాలు చేపట్టిన రెండు ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారి ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రముఖులు అంబటి నాగేంద్రప్రసాద్, చెరుకు మధు ,పంచాయతీ పాలకవర్గ సభ్యులు కోట శ్రీనివాసరావు విఆర్ఒ సింహాచలం, వాలంటీర్ హిమబిందు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న సర్పంచి దంపతులు

మినుము పంటలో తెగుళ్లను నివారించాలి


రైతుతో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి జరీనా

ప్రజాశక్తి - మండవల్లి

మినుము పంటకు ఆశించే తెగుళ్లను ముందుగానే పరిశీలించి అరికట్టేలా చర్యలు తీసుకుంటే పైరులో అధిక లాభాలు పొందొచ్చని మండల వ్యవసాయాధికారి ఎస్‌కె.జరీనా తెలిపారు. మండలంలోని రుద్రవరంలో మినుము పంటను ఆమె రైతులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినుము పైరులో ఎండు తెగులును గమనించామని చెప్పారు. ఈ తెగులు మినుము పంటకు ఆశిస్తే ఆకులు పసుపు రంగులోకి మారి తొడిమలు ఆకులు కాండం, వేరులు క్రమేపి ఎండిపోతాయని తెలిపారు. తల్లి వేరు నిలువుగా చీల్చి పరిశీలిస్తే లోపలి భాగం ముదురు గోధుమ రంగులో ఉంటుందన్నారు. భూమిలో ఉండే ఈ శిలీంద్రం వేరు ద్వారా మొక్కలకు ప్రవేశించడం వల్ల మొక్కలు క్రమేపి ఎండిపోతాయన్నారు. ఈ తెగులు నుంచి పంటను రక్షించుకోవడానికి సమగ్ర సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలన్నారు. తెగుళ్లను తట్టుకునే ఎల్‌బిజి 402 645 648 752 రకాలను సాగు చేసుకోవాలన్నారు. వేసవిలో దుక్కులు వేయడం ద్వారా భూమిలోని సిలింద్రాలను నాశనం చేయవచ్చని పచ్చిరొట్ట సేంద్రీయ ఎరువులు భూమిలో వేసి కలియ దున్నుకోవాలని చెప్పారు. థైరం లేదా కాప్టాన్ లేదా కార్బెండిజం మూడు గ్రాములు ఒక కిలో విత్తనానికి ట్రైకోడర్మావిరిడి పది గ్రాములు ఒక కిలో విత్తనానికి కలిపి శుద్ధిచేసి విత్తుకోవాలన్నారు. మినుము పంటలో భూమి ద్వారా వ్యాప్తి చెంది తెగుళ్లను నివారించుకునేందుకు అభివృద్ధి పరచిన ట్రైకోడర్మావిరిడి అనగా చివికిన పశువుల ఎరువు 90 కిలోలు, వేప పిండి పది కిలోలు, ట్రైకోడర్మావిరిడి రెండు కిలోలు కలిపి అభివృద్ధి చేసిన భూమిలో చల్లుకోవాలని సూచించారు. మినుము పంటలో ఆశించిన తెగుళ్లకు మల్టీ కే ఒక కేజిని ఒక ఎకరాకు పిచికారీ చేసుకోవాలని తెలిపారు.

గృహ నిర్మాణ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - భీమడోలు

గృహ నిర్మాణ సంస్థ ద్వారా జగనన్న కాలనీల్లో అర్హులైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి తక్షణమే స్థలాల కేటాయింపు, నిర్మాణపు దశల వారీగా బిల్లుల చెల్లింపు, రాయితీపై నగదు రహిత ప్రాతిపదిక(ఆ తరువాత ఇంటి నిర్మాణ యూనిట్ ధర చెల్లింపులో సర్దుబాటు ప్రాతిపదిక గృహ నిర్మాణ సామగ్రి అందజేత సౌకర్యాలు) గల గృహ నిర్మాణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి కె.రామయ్య కోరారు. ఆగడాలలంక గ్రామంలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లబ్ధిదారుల అవగాహన కార్యక్రమానికి గ్రామ సర్పంచి భలే రాంబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపిపితో పాటు మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఆడిట్ ఆఫీసర్ ఎవిఆర్.గంగాధరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ సంస్థ భీమడోలు సహాయ ఇంజినీర్ సిహెచ్.సతీష్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ పరిధిలోని రెండు లే అవుట్‌లలో 145 ఇళ్ల నిర్మాణాలు జరగాల్సి ఉందన్నారు. వివిధ కారణాల వల్ల ఇప్పటివరకు గృహ నిర్మాణాల్లో జాప్యం చోటు చేసుకుందన్నారు. ప్రజా ప్రతినిధుల చొరవతో ప్రస్తుతం 88 గృహాల నిర్మాణాలు ప్రారంభమై వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మిగిలిన వారు సైతం నిర్మాణాలను ప్రారంభించుకునేందుకు ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వం పలు సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. అవగాహన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సర్పంచి మాట్లాడుతూ కొల్లేరులంక గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వ స్థలాల కేటాయింపునకు గల సమస్యలను ఎంఎల్ఎ వాసుబాబు సహకారంతో అధిగమించామన్నారు. మండల ప్రత్యేక అధికారి, ఇతర అధికారుల సహకారంతో కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ఉచితంగా విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. గ్రామపంచాయతీ సదరు లే అవుట్లలో రోడ్లు వేయటం, నిర్మాణాలకు అవసరమైన నీటి సరఫరా బాధ్యతలు తీసుకుందన్నారు.


మాట్లాడుతున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - చింతలపూడి

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఎంఎల్ఎ ఉన్నమాట్ల ఎలిజా అన్నారు. మండలంలోని చింతంపల్లి గ్రామంలో శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నామని చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చింతంపల్లి సర్పంచి రామకృష్ణ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల (బాలికలు)లో ఖాళీగా ఉన్న (పీడీ) ఫిజికల్ డైరెక్టర్ పోస్టుకు అవుట్‌సోర్సింగ్ పద్ధతిపై మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గురుకుల పాఠశాల, కళాశాల కన్వీనర్ ప్రిన్సిపల్ కె.సుభాషిణిరాణి తెలిపారు. ఈ నెల నాలుగో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అభ్యర్థులు డిగ్రీ, ఎంపిఇడి తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించి ఉండాలని తెలిపారు. మెరిట్ ఆధారంగా డెమో, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు అందించిన అభ్యర్థులు ఈ నెల తొమ్మిదో తేదీన గురుకుల పాఠశాల (బాలురు) కెఆర్.పురంలో పది గంటలకు డెమో క్లాసులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9490957254 సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు. మండలంలోని తాడువాయి, వేగవరం, జంగారెడ్డిగూడెంలో ప్రమాదాల నివారణకు వేగ నియంత్ర స్టాపర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాగర్‌బాబు మాట్లాడుతూ వాహనదారులు జాతీయ రహదారిపై నిదానంగా వెళ్లాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.

గణపవరంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - గణపవరం

వైసిపి హయంలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని టిడిపి గణపవరం అధ్యక్షులు కూసంపూడి సురేంద్రకుమార్ రాజు అన్నారు. గణపవరంలో శనివారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కడగళ్ల చిన్న, నాయకులు పల్లి వెంకటేశ్వరరావు, మధుషేక్, బసిరుద్దీన్, కాపవరం చిన్న పాల్గొన్నారు.

జగన్‌ది అసమర్ధ పాలన : టిడిపి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రాష్ట్రంలో సిఎం జగన్‌మోహన్ రెడ్డి అసమర్ధ పాలనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టిడిపి పోలవరం నియోజకవర్గ కీన్వనర్ బొరగం శ్రీనివాసులు విమర్శించారు. స్థానిక టిడిపి క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు యువగళం పాదయాత్రలో వస్తున్న ఆదరణ చూసి వైసిపి నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. పోలీసు వ్యవస్థను వారి చేతిలో పెట్టుకుని పాదయాత్ర అడ్డుకోవటానికి చూస్తున్నారన్నారు. అనంతరం బూసరాజుపల్లిలో జరిగిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి జారం చాందినీ విద్యాసాగరిక, సుంకర వెంకట్రావు, పూసం ముక్కమ్మ, పైదా వసంతరావు, చోడెం రామచంద్రరావు, ఏలూరు పార్లమెంట్ ఐటిడిపి అధ్యక్షులు శావిలి సుభాష్ చంద్రబోస్, ఎస్‌సి సెల్ రాష్ట్ర సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ మానేల్లి బాలు, పసుమర్తి భీమేశ్వరరావు, గన్నిన సూర్యచంద్రరావు, తెలుగుమహిళా నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు లక్ష్మి పాల్గొన్నారు.

7న రైతు సంఘం మండల సమావేశం

ప్రజాశక్తి - గణపవరం

ఈ నెల ఏడో తేదీన రైతు సంఘం గణపవరం మండల స్థాయి కార్యకర్తల సమావేశం పిప్పర ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు సంఘం మండల కార్యదర్శి గుత్తుల శ్రీను తెలిపారు. ఈ సమావేశానికి రైతు సంఘం పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు చింతకాయల బాబురావు హాజరవుతున్నట్లు తెలిపారు.

'జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'

ప్రజాశక్తి - గణపవరం

జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత జన సైనికులపై ఉందని ఆ పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పచ్చమట్ల ధర్మరాజు అన్నారు. అప్పన్నపేట, జల్లి కాకినాడ గ్రామాల్లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జనసేన తన వంతు కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో జనసేన పార్టీని గ్రామ, మండల స్థాయిలో బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జనసేన పార్టీకి ఇతర పార్టీలతో పొత్తు ఉన్నా లేకపోయినా ఉంగుటూరు సీటు జనసేన పార్టీదేనన్నారు. పాలక పార్టీ పంచాయతీ నిధులు ఇవ్వకపోవడం వల్ల అభివద్ధి కుంటుపడిందన్నారు. వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి గుండుమోలు చినరత్తయ్య, నియోజకవర్గ నాయకులు వంగా రఘు, తోట పవన్, జంపా శ్రీను, తానేటి జోగేశ్వరరావు పాల్గొన్నారు.